
విజేతలకు కప్ అందజేస్తున్న కేటీఆర్, వినయ్‌భాస్కర్

# రాజకీయాల్లోనూ ఇదే స్ఫూర్తి ఉండాలి

- దాస్యం ఏటా పోటీలు నిర్వహించడం అభినందనీయం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కేసీఆర్ క్రికెట్ కప్ విజేతలకు బహుమతుల ప్రదానం

హనుమకొండ, ఫిబ్రవరి 18 : గెలుపోటములకు అతీతమైన స్ఫూర్తి కేవలం క్రీడల్లోనే కాదు రాజకీయాల్లోనూ ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఇటీవల కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించగా విజేతలకు మంగళవారం హైదరాబాద్‌లో కేటీఆర్ బహుమతులు ప్రదానం చేశారు. క్రీడాకారుల కోసం ఏటా పశ్చిమ నియోజకవర్గంలో కేసీఆర్ క్రికెట్ చాంపియన్‌షిప్‌తో పాటు వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహిస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌కు అభినందనలు తెలిపారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల కోసం దాస్యం పనిచేస్తున్నారని అన్నారు. అధికారం లేకున్నా ప్రజల కోసం బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటున్నారని రామన్న ప్రశంసించారు. ప్రజల ఆశీర్వాదం, ముఖ్యంగా యువకుల పట్టుదలతో కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని కేటీఆర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్‌దే విజయమని కేసీఆరే మన ముఖ్యమంత్రి అని అన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ క్రికెట్ కప్-2025 విన్నర్‌గా 54వ డివిజన్, రన్నరప్‌గా 49వ డివిజన్ నిలువగా కేటీఆర్ వారికి ట్రోఫీ అందజేశారు. అలాగే ఇతర పోటీల్లోనూ సత్తా చాటిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ కాకతీయ క్రికెట్ అకాడమీ ఫౌండర్ ఫారుక్, సభ్యులు మాజిద్, అస్లాం, షాకీర్, వీరు, సిరాజ్, రాజేశ్‌కుమార్, డెక్క రాంబాబు, ఫర్దీన్, నాయకులు పులి రజనీకాంత్, జోరిక రమేశ్, రామ్మూర్తి, బుద్ధ వెంకన్న, పెద్దిరాజు, ప్రణయ్, యాదగిరి, రఘు పాల్గొన్నారు.

# పెరిగిన విద్యుత్ వినియోగం

- గత ఏడాదికంటే 10 శాతం ఎక్కువ
- రోజురోజుకూ అధికమవుతున్న ఉష్ణోగ్రతలు




హనుమకొండ, ఫిబ్రవరి 18 : వేసవికి ముందే ఎండలు మండుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాత్రివేళ కొంత చల్లగా ఉంటున్నా.. పగటి ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతుండడంతో పాటు ఉక్కపోత కూడా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం సైతం పెరుగుతున్నది. గత ఏడాది ఫిబ్రవరి 15న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,306 మెగా వాట్ల డిమాండ్ నమోదు కాగా, ఈ సారి అది 1,421 మెగావాట్లకు చేరుకున్నట్లు ఎన్పీడీసీఎల్ అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన గత ఏడాదితో పోల్చితే 10 శాతం అధికంగా 115 మెగావాట్ల విద్యుత్ వినియోగమైనట్లు అధికారులు పేర్కొన్నారు.

**వాతావరణంలో మార్పులతో..**

రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతల్లో హెచ్చుదల ఉండడంతో విద్యుత్ వినియోగం పెరుగుతున్నది. మధ్యాహ్న సమయంలో 35 డిగ్రీల సెల్సియస్ దాటి ఎండ తీవ్రత నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు విరివిగా వినియోగిస్తున్నారు. అంతేకాక వరితోపాటు ఇతరత్రా పంటల అవసరాలకు నీటి వినియోగం పెరగడంతో రైతులు వ్యవసాయ మోటర్లను నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరుగుతున్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేలా ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 18,36,370 సర్వీసులు**

ఎన్పీడీసీఎల్ అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలోని ఐదు సర్కిళ్ల పరిధిలో మొత్తం 18,36,370 విద్యుత్ సర్వీసులున్నాయి. హనుమకొండ సర్కిల్ పరిధిలో అన్ని సర్వీసులు కలిపి 4,84,208, వరంగల్ 4,19,318, జనగామ 2,92,650, జయశంకర్ భూపాల్‌పల్లి 3,00,346, మహబూబాబాద్ సర్కిల్ పరిధిలో 3,39,848 సర్వీలున్నట్లు అధికారులు తెలిపారు.

# ఇసుక దందా.. అధికారుల అండ !

ఒక్కో వాహనానికి పక్కాగా లెక్కగట్టి ముట్టజెప్పాల్సిందే..

*ఇసుక అక్రమ దందాకు పోలీసు, రెవెన్యూ అధికారులు అండగా నిలుస్తున్నారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడి అక్రమార్కులతో అంటకాగుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఉమ్మడి జిల్లా పరిధిలోని వాగుల నుంచి తోడుతున్న ఇసుకను తరలించేందుకు సహకరిస్తున్నారు. ఇందుకోసం పొక్లైన్, ట్రాక్టర్ యజమానుల నుంచి మామూళ్లు దండుకుంటున్నారు. ఒక్కో వాహనానికి పక్కాగా రేటు ఫిక్స్ చేసి నెలవారీగా వసూలు చేస్తున్నారు. అమ్యామ్యాలు సమర్పించుకున్న వాహనాలు ఎలాంటి అడ్డంకులు లేకుండా గమ్యస్థానాలకు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒకరిని నియమించుకొని కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఉన్నతాధికారులు తనిఖీలకు వచ్చే సమాచారాన్ని ముందస్తుగానే లీక్ చేసి తమ విధేయతను చాటుకుంటున్నారు. ఇటీవలి ప్రభుత్వ ఆదేశాలను తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేల అనుచరుల వాహనాలకు మినహాయింపులు ఇస్తున్నారు.*

*- వరంగల్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

**పొక్లైన్‌కు రూ. 50 వేలు.. ట్రాక్టర్‌కు రూ 3 వేలు**


ట్రాక్టర్‌లో జేసీబీ సాయంతో లోడ్ చేస్తున్న మట్టి

- మామూళ్ల మత్తులో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది
- ఇసుక రవాణా జరిగే మార్గంలోని ప్రతి స్టేషన్‌కు అమ్యామ్యాలు
- రెవెన్యూ అధికారుల ప్రత్యేక అవసరాలకూ ముడుతున్న డబ్బులు
- ప్రతి నెలా సమర్పిస్తున్న యజమానులు, సిండికేట్లు
- ఎమ్మెల్యేల అనుచరుల ట్రాక్టర్లకు మినహాయింపులు

ఇసుక అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్న ప్రభుత్వ మాటలు ప్రకటనలకే పరిమితవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పోలీసు, రెవెన్యూ అధికారులే ఈ అవినీతికి అండగా నిలుస్తున్నారు. గోదావరిలోని ప్రభుత్వ రీచ్‌ల నుంచి లారీల్లో వచ్చే ఇసుకకు సమానంగా ఆకేరు, మానేరు, చలివాగుల నుంచి వందల ట్రాక్టర్లలో ఇసుక ప్రతిరోజూ వరంగల్ నగరానికి చేరుతున్నది. ఉమ్మడి జిల్లాలోని వాగులతో పాటు వాటికి ఇరువైపులా ఉన్న అసైన్డ్, పట్టా భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరిపి అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఇది సజావుగా సాగేందుకు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు నెలవారీ మామూళ్లు అందుకుంటున్నారు. ఇసుకను తరలించే మార్గంలోని ప్రతి పోలీసు స్టేషన్, రెవెన్యూ ఆఫీసుకు ఒక్కో పొక్లైన్‌కు నెలకు రూ. 50 వేలు, ట్రాక్టరుకు రూ. 3 వేల చొప్పున లెక్కగట్టి ముట్టజెబుతున్నారు. ఆకేరు వాగు నుంచి వరంగల్‌కు ఇసుక రవాణా అయ్యే రోడ్డులోని వర్ధన్నపేట, జఫర్‌గఢ్, ఐనవోలు, మామునూరు, మిల్స్‌కాలనీ, మహబూబాబాద్ జిల్లాలోని నెల్లికుదురు, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ, డోర్నకల్, జనగామ జిల్లాలోని చీటకోడూరు, యశ్వంతాపూర్ వాగులున్న దేవరుప్పుల, లింగాలఘనపురం పోలీసు స్టేషన్లకు యజమానుల నుంచి మామూళ్లు అందుతున్నాయి. పొక్లైన్ ఓనర్లు నేరుగా, ట్రాక్టర్ల యజమానులు సిండికేట్‌గా వసూలు చేసి అందజేస్తున్నారు. ఇసుక తవ్వకాలు జరిపే మండలాల తహసీల్ కార్యాలయాలకూ ఇంతే మొత్తంలో సమర్పించుకుంటున్నారు. వర్ధన్నపేట, ఐనవోలు తహసీల్దారు ఆఫీసుల్లో మాత్రం డబ్బుల రూపంలో కాకుండా కార్యక్రమాలు, ఇతర ప్రత్యేక అవసరాల బిల్లుల కోసం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఇసుక అక్రమ దందాలో మామూళ్ల వ్యవహారాన్ని చక్కబెట్టేందుకు పోలీసు స్టేషన్లలో ఉన్నతాధికారులు ప్రత్యేకంగా కానిస్టేబుల్‌ను నియమించుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ, రవాణా శాఖ అధికారులు తనిఖీ చేయకుండా ఈ కానిస్టేబుల్ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నారు.


జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లు శివారు ఆకేరు వాగును ఇటీవల పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా


వర్ధన్నపేట మండలం కొత్తపల్లిలో ఆకేరు వాగు, దాని పక్కన భూముల్లో మట్టిని నీళ్లతో కడిగి ఇసుకగా మారుస్తున్న తీరు (ఫైల్)

**అటవీ ప్రాంతంలో రూ.10 వేలు**

ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాల పరిధి అటవీ ప్రాంతాల్లోని వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. మల్హర్ మండలం సరిహద్దు మానేరు వాగులోని ఇసుకను ప్రభుత్వ రీచ్‌ల ఇసుకగా చెప్పి వరంగల్, పెద్దపల్లికి తరలించి అధిక ధరకు అమ్ముతున్నారు. భూపాలపల్లి మండలం దూదేకులపల్లి పెద్దవాగు, బొగ్గులవాగు, కాశీంపల్లి చెలిమెలవాగు, తీగెల వాగు, మోరంచపల్లి వాగు, గద్దెకుంటవాగు, చిట్యాల మండలం కాల్వపల్లి వాగు, టేకుమట్ల మండలంలోని మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. ఇక్కడి పోలీసులు, రెవెన్యూ, అటవీ అధికారులకు ట్రాక్టర్ల యజమానుల నుంచి ప్రతినెలా రూ. 10 వేల చొప్పున మామూళ్లు అందుతున్నాయి.

**ముందుగానే లీక్..**

ఇసుక అక్రమ రవాణాలో పోలీసు, రెవెన్యూ అధికారుల జోక్యం ఇటీవల మరోసారి వెలుగు చూసింది. ఇసుక అక్రమ దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఆ వెంటనే వరంగల్ పోలీసు కమిషనర్, ఇతర జిల్లాల ఎస్పీలు ఇసుక అక్రమ తవ్వకాలు జరిగే ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఉన్నతాధికారులు వెళ్లినప్పుడు అక్కడ వాహనాలు లేకపోవడంతో ఏమీ లేదని తిరిగి వచ్చారు. వరంగల్ సీపీ ఇటీవల వర్ధన్నపేట, జఫర్‌గఢ్ మండలాల్లోని ఇసుక తవ్వకాలు జరిపే గ్రామాలకు వెళ్లగా ఆయన వస్తున్న సమాచారం ఉదయమే పొక్లైన్ ఓనర్లు, ట్రాక్టర్ల సిండికేట్‌కు చేరింది. ఇసుక వ్యవహారాల కోసం పోలీసు స్టేషన్లలో నియమించిన సిబ్బందే తనిఖీల సమాచారాన్ని ముందుగానే వారికి అందించినట్లు తెలిసింది. దీంతో ఉన్నతాధికారులు అక్కడికి వెళ్లినప్పుడు అక్కడ ఎవరూ లేకపోగా, కొన్ని గంటల ముందు వరకు ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు మాత్రం కనిపించాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత అధికార పార్టీ ఎమ్మెల్యేల అనుచరులుగా చెలామణి అవుతున్న వారి ట్రాక్టర్లు మాత్రమే ఇసుక అక్రమ రవాణా చేస్తున్నాయి. మిగిలిన వారి వాహనాలను తనిఖీలు, టార్గెట్ పేరిట అక్కడక్కడా పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు.

## రైతు ప్రాణం తీసిన కోతులు!

- చేనులో నుంచి తరుమబోయి బావిలో పడ్డ వెంకన్న
- నెక్కొండ మండలం తేజావత్ తండాలో ఘటన


తేజావత్ వెంకన్న (ఫైల్)

నెక్కొండ, ఫిబ్రవరి 18: చేనులో నుంచి కోతులను తరిమికొట్టబోయి ఓ రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో పడి రైతు మృత్యువాతపడ్డాడు. నెక్కొండ మండలం మడిపెల్లి శివారు తేజావత్ తండాలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన తేజావత్ వెంకన్న(42) మంగళవారం మక్కజొన్న చేనులో కోతులు పడకుండా చేనుకు కాపలాగా వెళ్లాడు. ఆయన భార్య సునీత కొద్దిదూరంలోనే చేనుకు కాపలాగా ఉంది. మధ్యాహ్నం సమయంలో చేనులోకి కోతులు రాగా వాటిని తరిమే క్రమంలో వెంకన్న ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న వారు కేకలు వేయగా భార్య సునీత, గ్రామస్తులు తేజావత్ భరత్, భూక్యా సాగర్, తేజావత్ నరేశ్, తేజావత్ ఆనంద్ వ్యవసాయబావి వద్దకు వెంకన్నను రక్షించేందుకు వెళ్లారు. అప్పటికే వెంకన్న బావిలో మునిగి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## పారిశుధ్య కార్మికురాలిపై కోతుల దాడి




ఎంజీఎంకు తరలిస్తున్న స్థానికులు, (ఇన్‌సెట్)లో చేతికి అయిన గాయం

ఖిలావరంగల్, ఫిబ్రవరి 18 : గ్రేటర్ వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌లో మంగళవారం బల్దియా పారిశుధ్య కార్మికురాలు గన్నారపు తేజపై కోతులు దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. ఖిలావరంగల్ తూర్పు కోటకు చెందిన కార్మికురాలు విధుల్లో భాగంగా శివనగర్‌లో పారిశుధ్య పనులు చేస్తుండగా కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపై దాడి చేయగా చేతికి, కేకలు వేస్తూ తప్పించుకొనే క్రమంలో కిందపడడంతో మోకాలికి గాయమైంది. స్థానికులు కోతులను తరిమికొట్టారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులా?

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 18 : కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెడుతారా అని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పరకాల సబ్ జైల్లో కాళేశ్వరం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డిని ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోగా ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. జైల్లో పెట్టినా వెనకడుగు వేసిది లేదని, హామీలు అమలయ్యేదాకా బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. ఆయన వెంట మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, సీనియర్ నాయకులు అన్నారీ ప్రకాశ్, మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీం ఖాన్, మేసినేని రవీందర్‌రావు, తడకల రమేశ్, రామ్, లక్ష్మణ్, సునీల్ ఉన్నారు.



పరకాల సబ్ జైలు వద్ద మాట్లాడుతున్న పుట్ట మధు

## సుమతిరెడ్డి కళాశాలకు అటానమస్

**ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి**



ఉత్తర్వుల కాపీని చూపుతున్న వరదారెడ్డి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 18 : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లోని సుమతి రెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా దక్కింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ) హైదరాబాద్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి వెల్లడించారు. మంగళవారం హనుమకొండ కాకాజీకాలనీ ఎస్సార్ కాలేజీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని ముఖ్య నగరాల కళాశాలలకు దీటుగా, సుమతిరెడ్డి కళాశాల విద్యార్థినులకు అవసరమైన మెళకువలు నేర్పించి, అన్ని రంగాల్లో రాణించేందుకు దోహదం చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లోని వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో సుమతి రెడ్డి కాలేజీ విద్యార్థినులు ఉద్యోగాలు చేస్తున్నారని, కళాశాల ప్రతిష్టను నిలుపుతున్నారని తెలిపారు. పలు దేశాల్లోని ప్రతిష్టాత్మక సంస్థల్లో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కళాశాల అకడమిక్, సాంకేతిక అభివృద్ధి, అభ్యున్నతికి అటానమస్ దోహదపడుతుందని వరదారెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ రాజశ్రీరెడ్డి, వివిధ విభాగాధిపతులు ఈ సుదర్శన్, కే మహేందర్, ఎన్ శ్రీవాణి, ఏవో వేణుగోపాల స్వామి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# సీసీఐ సర్వర్ డౌన్.. రైతు పరేషాన్


కేసముద్రం మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన పత్తి ( ఫైల్)


మహబూబాబాద్ జిల్లాలో ఓ రైతు తన ఇంట్లో నిల్వ చేసిన పత్తి

జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ)/ కేసముద్రం: సీసీఐ అధికారులు సర్వర్ సమస్య అంటూ పత్తి విక్రయాలు నిలిపేయడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. పత్తిని ఏం చేయాలో తెలియక తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఒకసారి ఇంటి నుంచి వాహనంలో తెచ్చిన పత్తిని మళ్లీ తీసుకెళ్లాలంటే వాహనాలు, కూలీల ఖర్చు తడిసి మోపెడవుతున్నది. దీంతో తక్కువైనా దళారులకు విక్రయించి వెళ్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉండగా, రూ.6500 నుంచి రూ. 7వేల వరకే చెల్లిస్తున్నారని రైతులు వాపోతున్నారు. శుక్రవారం కేసముద్రం మార్కెట్‌లో క్వింటాకు రూ.6825, కనిష్ఠంగా రూ. 5,411 పలికింది. సీసీఐ కొనుగోలు చేస్తున్న ధర తో పోలిస్తే క్వింటాకు రూ. 540 కంటే ఎక్కువ గానే రైతులు నష్టపోతున్నారు. పంట విక్రయాలు చివరి దశకు చేరుకున్న సమయంలో సీసీఐ అధికారులు సర్వర్ సమస్య అంటూ విక్రయాలు నిలిపివేశారని రైతు సంఘాల నాయకు లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సీసీఐ అధికారులు స్పందించి కొనుగో ళ్లు చేపట్టి మద్దతు ధర అందించాలని రైతులు కోరుతున్నారు.

- నిలిచిన పత్తి కొనుగోళ్లు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులకు విక్రయం
- ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాతలు

**భూపాలపల్లి జిల్లాలో ఐదు మిల్లులు**

భూపాలపల్లి జిల్లాలో కాటారం మండలంలో రెండు, భూపాలపల్లి మండలంలో ఒకటి, చిట్యాల మండలంలో రెండు పత్తి మిల్లుల్లో సీసీఐ పత్తి కొనుగోళ్లు జరుపుతున్నది. తరచూ ఆన్‌లైన్ సమస్య తలెత్తుతున్నదని, దీనికి తోడు తేమ పేరుతో కోతలు విధిస్తుండడంతో మద్దతు ధరకు గండి పడుతున్నదని రైతులు వాపోతున్నారు. సీసీఐ ఆన్‌లైన్ సమస్యతో ఐదు మిల్లుల్లో పత్తి లోడ్‌తో వాహనాలు బారులు దీరాయి.


భూపాలపల్లిలోని ఎంఎస్ఆర్ పత్తి మిల్లులో క్యూ కట్టిన పత్తి వాహనాలు

**రైతులు నష్టపోతున్నా పట్టించుకోరా?**



వారం రోజులైనా సీసీఐ నెలకొన్న సాంకేతిక సమస్యను పరిష్కరించరా?.. ఆది నుంచి ఇదే తీరు. ప్రైవే ట్ మిల్లులకు రైతులు పత్తి అమ్ముతూ నష్టపోతున్నారు. రైతులకు అవగాహన కల్పించ కపోవడంతో సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకుని వచ్చి, తిరి గి ఇంటికి తీసుకెళ్లలేక అదే మిల్లుకు ప్రైవే ట్‌గా అమ్మి నష్టపోతున్నారు. మి ల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కైందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా పత్తి కొనుగోళ్లు ప్రారంభించి, దళారీ వ్యవస్థను అరికట్టాలి.

*– చింతల రజినీకాంత్, రైతు సంఘం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి*

